
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.23 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి. మార్కెట్‌కు 101 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.10 పలికింది. కనిష్టం రూ.3, సరాసరి రూ.5 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/21.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పారామెడికల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం క్రైం: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఖాళీగా ఉన్న 52 పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వీ పాల్ రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు గ్రేడ్–2 ఫార్మసీ, ఏడు థియేటర్ అసిస్టెంట్, రెండు ల్యాబ్ అటెండెంట్, మూడు పోస్టుమార్టమ్ అసిస్టెంట్, రెండు మెడికల్ రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, ఐదు ప్లంబర్, రేడియోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్, డెంటల్ టెక్నీషియన్, 26 ఎంఎన్‌ఓ/ఎఫ్‌ఎన్‌ఓ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తులను డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

17న డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 17న ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. నగరంలోని కేఎస్‌ఎన్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఐదు, ఆరో సెమిస్టర్‌లో ఏదైనా ఒక్క సబ్జెక్టు ఫెయిలైన వారు మాత్రమే ఇన్‌స్టంట్ పరీక్ష రాయడానికి అర్హులని తెలిపారు. ఈ నెల 11లోపు పరీక్ష ఫీజు కట్టడానికి చివరి తేదీ అని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

13 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: ఉపరితల ఆవర్తనం, రుతుపవన ద్రోణి ప్రభావంతో జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 13 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా తనకల్లులో 7.8 మి.మీ వర్షపాతం నమోదైంది. రామగిరి 5.4 మి.మీ, నల్లచెరువు, అమడగూరు మండలాల్లో 3.4 మి.మీ, ధర్మవరం 3.2 మి. మీ, కొత్తచెరువు 2.8 మి.మీ, నల్లమాడలో 2.4 మి.మీ, తాడిమర్రి, బుక్కపట్నం, ముదిగుబ్బ మండలాల్లో 1.8 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. తాజా వర్షాలతో ప్రత్యామ్నాయ పంటలతో పాటు ఖరీఫ్‌లో సాగు చేసిన ఇతర పంటలకూ మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

9 మంది ఎస్‌ఐల బదిలీ



పుట్టపర్తి టౌన్/రొళ్ల: జిల్లాలో తొమ్మిది మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కల్పిస్తూ ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఇషాక్‌బాషాను పట్నం పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ ఉన్న శరత్‌చంద్రను వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న సి.మధురామచంద్రుడుకు రొళ్లకు పోస్టింగ్ ఇచ్చారు. హిందూపురంలో ట్రాఫిక్ స్టేషన్‌లో ఉన్న ఎస్‌ఐ కళావతిని, హిందూపురం టూటౌన్‌కు, హిందూపురం టూటౌన్‌లో ఉన్న జి.వెంకటరమణను 'దిశ' స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న జి.రామచంద్రయ్య, జె.శివశంకర్‌ను డీసీఆర్‌బీకి పంపారు. కదిరి రూరల్ స్టేషన్‌లో ఉన్న బాబ్జాన్‌ను కదిరి పట్టణ పోలీసు స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న సి.వెంకటేసులును 'దిశ' స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

18న వినాయక చవితి




సమావేశంలో మాట్లాడుతున్న అర్చకులు

కదిరి టౌన్: వినాయక చవితి పండుగను ఈనెల 18వ తేదీ సోమవారం జరుపుకోవాలని ఖాద్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయ అర్చకులు సూచించారు. బుధవారం వారు ఈఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. పంచాంగం పరిశీలించి 18వ తేదీ చవితి, 22 (శుక్రవారం) నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ప్రధాన అర్చకులు అంజన్‌కుమార్ స్వామి, సుబ్రమణ్యం స్వామి తదితరులు పాల్గొన్నారు.

పొలం లెక్క.. ఇక పక్కా!

- జిల్లాలో జోరుగా సాగుతున్న రీ సర్వే
- రైతుల సమక్షంలో భూములను సర్వే చేస్తున్న అధికారులు
- భూముల కొలతలు, హద్దులు పక్కాగా నమోదు
- సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

పచ్చని గ్రామాల్లో చిచ్చుపెడుతున్న భూతగాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష' పేరుతో రీసర్వే చేస్తోంది. రైతు సమక్షంలో సర్వే పూర్తి చేసి సరిహద్దు రాళ్లు పాతుతోంది. పక్కా కొలతలతో రైతులకు ఉచితంగా యాజమాన్య హక్కు పత్రాలిస్తోంది. ఫలితంగా గ్రామాల్లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతోంది.



భూమి సర్వే తర్వాత పక్కా లెక్కలతో రూపొందించిన స్కెచ్ (ఇన్‌సెట్) హద్దులు సరిచూస్తున్న సర్వేయర్

పుట్టపర్తి అర్బన్: భూమి కొలతలు వేయాలంటే గతంలో పెద్ద ప్రహసనం. పనులు మానుకుని రోజుల తరహడి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు. పనిచేయిస్తామంటూ దళారులు రంగ ప్రవేశం చేసి జేబులకు చిల్లు పెట్టేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్ సర్కార్... పల్లెల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష'పథకం తీసుకువచ్చింది. భూములను ఉచితంగానే రీ సర్వే చేసి పక్కా కొలతలతో సరిహద్దులు ఏర్పాటు చేస్తోంది.

విధుల్లో 424 మంది సర్వేయర్లు..

జిల్లాలోని 32 మండలాల పరిధిలో 461 రెవెన్యూ గ్రామాలున్నాయి. సుమారు 8,924 చదరపు కిలో మీటర్ల భౌగోళిక ప్రాంతం ఉంది. దీన్ని యంత్రాంగం విడతల వారీగా సర్వే చేస్తోంది. తొలి విడతగా 26 గ్రామాల్లో, రెండో విడతలో 59 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు. ప్రస్తుతం మూడో విడతలో భాగంగా 199 గ్రామాల్లో రీ సర్వే చేస్తున్నారు. సర్వేలో 32 మంది మండల సర్వేయర్లు, 392 మంది విలేజ్ సర్వేయర్లు పాల్గొంటున్నారు. రీ సర్వే పూర్తయితే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఇప్పటికే అన్ని మండలాల్లో రీ సర్వేపై ఆర్డీఓలు, తహసీల్దార్లు సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉచితంగా సబ్ డివిజన్, మ్యుటేషన్..

'జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష'పథకంలో భాగంగా చేపట్టిన రీసర్వేలో ప్రభుత్వం ప్రతి రైతుకూ సబ్ డివిజన్, మ్యుటేషన్‌లను ఉచితంగా అందజేస్తోంది. సాధారణంగా సబ్ డివిజన్‌కు రూ.600, మ్యుటేషన్‌కు రూ.100 చొప్పున ఖర్చు అయ్యేది. దీంతో పాటు చాలా సమయం పట్టేది. కానీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో రైతుకు ఇబ్బంది లేకుండా పోయింది. సబ్ డివిజన్, మ్యుటేషన్ ఉచితంగా చేయడంతో పాటు అధికారులే రైతులను వెతుక్కుంటూ వెళ్లి వారి సమక్షంలోనే సర్వే చేస్తున్నారు. రీ సర్వే పూర్తయిన తర్వాత రైతులకు యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వడం, డిజిటల్ రికార్డులు రూపొందించడంతో పాటు మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు చేస్తున్నారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అక్టోబర్ చివరి నాటికి పూర్తి..

జిల్లాల్లో ఇప్పటి వరకూ మూడు విడతల్లో రీ సర్వే చేపట్టారు. అక్టోబర్ చివరి నాటికి జిల్లాలోని అన్ని మండలాల్లో రీసర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మూడో విడత సర్వే చేపట్టిన గ్రామాల్లో ఫైనల్ ఆర్‌ఓఆర్ పూర్తి చేయమని ఆదేశాలిచ్చారు. భూముల కొలతలు, సరిహద్దులు పక్కాగా చూపేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. రీ సర్వేలో భాగంగా తొలుత రోవర్, డ్రోన్‌లతో గ్రామ సరిహద్దులు, మండల సరిహద్దులు గుర్తిస్తున్నారు. అనంతరం అత్యాధునిక పరికరాలతో పొలాల సరిహద్దులు గుర్తించి హద్దు రాళ్లను నాటుతున్నారు. రీ సర్వేలో రైతులు కచ్చితంగా పాల్గొనాలని, పొలాల సరిహద్దులు నిర్ణయించి రాళ్లను నాటే సమయంలో దగ్గరుండి సరి చూసుకోవాలని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు ఉండవంటున్నారు.



కొత్తచెరువు మండలం తిరుమలదేవరపల్లిలో డిజిటల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ చేతన్

మండలాలు	32
రెవెన్యూ గ్రామాలు	461
జిల్లాలోని సర్వేయర్లు	424 మంది
జియోగ్రాఫికల్ ఏరియా	8,924 చ.కి
మొదటి విడత సర్వే చేసిన గ్రామాలు	26
రెండో విడత సర్వే చేసిన గ్రామాలు	59
మూడో విడత సర్వే చేస్తున్న గ్రామాలు	199

85 గ్రామాల్లో సర్వే పూర్తి



ప్రజలు, రైతుల సహకారంతో రీ సర్వే కార్యక్రమం జిల్లాలో వేగవంతంగా సాగుతోంది. ఇప్పటికే 85 గ్రామాల్లో ప్రక్రియ పూర్తయ్యింది. మూడో విడతలో 199 గ్రామాల్లో సర్వే పూర్తి కావచ్చింది. రీసర్వేపై ఇప్పటికే అన్ని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాం.
– టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్

ఎంసీఏకు యమ క్రేజీ

- గతేడాది కేవలం 2,790 సీట్లకు మాత్రమే అనుమతి
- 2023–24 విద్యా సంవత్సరంలో 5,640 సీట్ల భర్తీకి పచ్చజెండా
- కంప్యూటర్ సైన్సెస్ కోర్సులకు డిమాండ్ పెరగడమే ఇందుకు కారణం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లో మొత్తం 68 కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు నిర్వహించడానికి ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. 2023–24 విద్యా సంవత్సరానికి 43 ఇంజినీరింగ్ కళాశాలల్లో, 2 ఇంటిగ్రేటెడ్ కళాశాలలు, 23 స్టాండలోన్ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఎంబీఏ మొత్తం 9,912 సీట్లు, ఎంసీఏ 5,640 సీట్లు భర్తీ చేసుకోవడానికి అనుమతి లభించింది. గతేడాది ఎంసీఏ సీట్లు 2,790 మాత్రమే కేటాయించగా, తాజాగా 5,640 సీట్లు కావాలని కోరారు. ఈ మేరకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకోగా, ఇందుకు జేఎన్‌టీయూ అనంతపురం ఆమోదం తెలిపింది. ఎంబీఏ గతేడాది 8,757 సీట్లు ఉండగా, తాజాగా 9,192 సీట్లకు పెంపుదల చేశారు. ఎంబీఏ నామమాత్రంగా పెరగగా, ఎంసీఏ కోర్సుల్లో సీట్లు భారీగా పెరగడం విశేషం. నంద్యాలలో ఒక ఎంబీఏ కళాశాలకు ఈ ఏడాది అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆ కళాశాల అడ్మిషన్లు రద్దు చేశారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో కంప్యూటర్ సైన్సెస్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఎంసీఏ కోర్సుకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఐసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఖరారు..

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ తరువాత అత్యంత ప్రాధాన్యం ఉన్న ఐసెట్ –2023 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఏపీ ఐసెట్‌ను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పకడ్బందీగా నిర్వహించి ఫలితాలను విడుదల చేసింది. గురువారం కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ నెల 8 నుంచి 14 వరకు వెబ్ కౌన్సెలింగ్ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. 9 నుంచి 16వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 12న ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన, 19 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 22న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తారు.

లో ఓల్టేజీకి చెక్

- 37 అదనపు విద్యుత్ సబ్‌స్టేషన్లు
- శరవేగంగా నిర్మాణ పనులు
- రెండు నెలల్లో వినియోగంలోకి రానున్న సబ్‌స్టేషన్లు
- ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు ఊరట

అనంతపురం టౌన్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఆ శాఖ చర్యలు చేపట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే అదనపు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 261 సబ్ స్టేషన్లు ఉన్నాయి. కొన్ని సబ్ స్టేషన్లకు సుదూర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు లో ఓల్టేజీ సమస్య ఎదురవుతోంది. ఆ సమస్యను పరిష్కరించేందుకు అదనపు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించారు. జిల్లాలో ఉన్న ఆరు విద్యుత్ డివిజన్లకు ప్రతి డివిజన్‌కు 6కు పైగా కొత్త సబ్ స్టేషన్లు మంజూరు చేసింది. మొత్తంగా 37 నూతన సబ్ స్టేషన్ల నిర్మాణాల కోసం రూ.81.4కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అక్టోబర్ నెలాఖరులోపు 100 శాతం నిర్మాణ పనులు పూర్తి చేసి కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనున్నారు.



- బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. మరో 10 రోజుల్లో నిర్మాణ పనులు 100శాతం పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ విద్యుత్ సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే బత్తలపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని గృహ వినియోగదారులతోపాటు వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.



- అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో సబ్‌స్టేషన్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. సబ్‌స్టేషన్ వినియోగంలోకి వస్తే అనంతపురం రూరల్ మండలం కొడిమి, ప్రజా చైతన్యకాలనీ, జర్నలిస్టు కాలనీ, రాచానపల్లి, సిండికేట్‌నగర్, నరసనాయనికుంట, ఎ.నారాయణపురం, కూడేరు మండలం గొటుకూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం, లెప్రసీ కాలనీ తదితర గ్రామాల గృహ విద్యుత్ వినియోగదారులతోపాటు వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందుతుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కనెక్షన్లు

డివిజన్	గృహ కనెక్షన్లు	కమర్షియల్ కనెక్షన్లు	వ్యవసాయ కనెక్షన్లు
అనంతపురం	2,13,994	30,452	33,600
అనంతపురం రూరల్	1,32,171	13,425	58,906
గుత్తి	1,97,843	22,616	48,594
హిందూపురం	1,98,574	19,662	42,282
కదిరి	1,88,740	17,119	51,246
కళ్యాణదుర్గం	1,62,430	13,698	75,543
మొత్తం	10,93,752	1,16,982	3,10,171

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదనపు సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నారు. మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి లో ఓల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేస్తాం. ఇప్పటికే విద్యుత్ తీగలు, శిథిలావస్థలో ఉన్న స్తంభాల పునరుద్ధరణ పనులు సాగుతున్నాయి. అన్ని పనులూ పూర్తి అయితే రానున్న రోజుల్లో విద్యుత్ సమస్యలకు తావుండదు.
– సురేంద్ర, ఎస్ఈ, విద్యుత్ శాఖ

నమ్మితే నట్టేట మునిగినట్టే!

'మేం పోలీసు డిపార్టుమెంటు వాళ్లం. ఫ్రెండ్ ఆపదలో ఉన్నాడు. అర్జెంటుగా డబ్బు పంపాలి. ఆన్‌లైన్ ద్వారా చెల్లించండి. మీకు క్యాష్ ఇస్తాం' అని గోరంట్లలో ఓ మహిళ నుంచి రెండు దఫాలుగా ఇద్దరు వ్యక్తులు రూ.76 వేలు వేయించుకున్నారు. 'కియా' పోలీసులు అని చెప్పడంతో ఆ మహిళ నమ్మి వారు చెప్పిన మేరకు డబ్బులు వేసింది. ఏటీఎంలో డబ్బు తీసుకొస్తామని చెప్పి వెళ్లిన వారు ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. 10 రోజుల క్రితం ఈ ఘటన జరిగింది.

'ఎమర్జెన్సీ. హాస్పిటల్‌లో బిల్లు కట్టాల్సి ఉంది. మేం పోలీసు డిపార్టుమెంటు.' అని ఇద్దరు వ్యక్తులు వారం క్రితం ధర్మవరం బస్టాండు వద్ద ఓ వ్యక్తిని కోరారు. రెండు దఫాలుగా మొత్తం రూ.36 వేలు ఫోన్ పే ద్వారా వేయించుకున్నారు. ఆ వ్యక్తిని మాటల్లో పెట్టి కొంతసేపటికే నగదు ఇవ్వకుండా ఉడాయించారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో రోజూ ఏదో చోట వెలుగు చూస్తున్నాయి.

- ప్రజల అమాయకత్వాన్ని 'క్యాష్' చేసుకుంటున్న కేటుగాళ్లు
- అత్యవసరమని నమ్మించి సులువుగా కుచ్చుటోపీ
- గోరంట్ల, పెనుకొండ, హిందూపురంలో అధికంగా మోసాలు

సాక్షి, పుట్టపర్తి

అమాయకులే లక్ష్యంగా మోసగాళ్లు కుచ్చుటోపీ పెడుతున్నారు. పోలీసులని ఒకచోట, ప్రభుత్వ ఉద్యోగులని మరోచోట, ఎక్సైజ్, సెబ్ పోలీసులంటూ ఇంకోచోట.. ఇలా నానా రకాలుగా చెప్పి అమాయకుల డబ్బు కొల్లగొడుతున్నారు. కొన్నిచోట్ల నకిలీ నోట్లు ఇచ్చి ఉడాయించిన దాఖలాలూ ఉన్నాయి.

కొత్త వ్యక్తులే టార్గెట్..

బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఎవరి ఖాతాకు వెళ్లిందనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. ఫోన్ పే నంబరు ద్వారా పరిశీలిస్తే.. స్థానికుడనే తెలుస్తున్నా.. ఆ వ్యక్తిని ప్రశ్నిస్తే, ఆ సిమ్ పోయిందని సమాధానం చెబుతున్నారు. ఫోన్ పోగొట్టుకున్నట్లు ఇంకొందరు చెబుతున్నారు. స్థానికంగా వ్యాపారం చేసే వారే కొత్త వ్యక్తులతో ఇలాంటి మోసాలు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పోలీసుల అలసత్వం..

అపరిచిత వ్యక్తుల చేతిలో మోసపోయిన బాధితులకు పోలీసులు అండగా నిలవడం లేదనే విమర్శలు



ఉన్నాయి. పోలీసుల పేరుతో బురిడీ కొట్టించారని బాధితులు చెప్పగానే.. 'మీరెందుకు ఇచ్చారంటూ' ప్రశ్నలు వేస్తుండడంతో బాధితులు నిస్సహాయులవుతున్నారు. ఏది ఏమైనా, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు నడపరాదని పోలీసులు సూచిస్తున్నారు.

అపరిచితులను నమ్మొద్దు



గుర్తు తెలియని వ్యక్తులతో ఆర్థిక లావాదేవీలు చేయరాదు. ఎలాంటి అనుమానం వచ్చినా పోలీసులకు ఫోన్ చేయాలి. పోలీసు డిపార్టుమెంటు అని చెప్పి డబ్బులు పంపాలని కోరితే వారి ఫొటోలు, వివరాలు సేకరించి మాకు పంపాలి. విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం. ఫోన్ పే, గూగుల్ పే నంబర్ల ఆధారంగా ఫిర్యాదు చేసినా, విచారణ చేసి తగిన న్యాయం చేస్తాం. – ఎస్పీ మాధవరెడ్డి, ఎస్పీ



అవతార పురుషుడు సత్యసాయిని కీర్తిస్తూ నృత్యరూపకం ప్రదర్శిస్తున్న భక్తులు



సాయి పథంలో స్వర్ణ భారతం నృత్యరూపకంలోని ఘట్టం



భక్తులకు వస్త్రాలను అందజేస్తున్న సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు

సాయి పథం.. స్వర్ణ భారతం

ప్రశాంతి నిలయం: మానవాళికి విలువలు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధిస్తూ సమసమాజ స్థాపనకు కృషి చేసిన సత్యసాయిని కీర్తిస్తూ విశాఖ భక్తులు ప్రదర్శించిన 'సాయి పథంలో స్వర్ణ భారతం' నృత్యరూపకం నయన మనోహరంగా సాగింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన విశాఖపట్నం సత్యసాయి భక్తులు బుధవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత 'సాయిపథంలో స్వర్ణ భారతం' నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. సత్యసాయి బోధనల సారాంశాన్ని వివరిస్తూనే... నేటి యువత సత్యసాయి మార్గాన్ని అనుసరిస్తూ భారత దేశ ఔన్నత్యానికి పాటుపడాలన్న సందేశాన్ని ఇచ్చారు. విశాఖ జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు తమ జిల్లాలో జరుగుతున్న సత్యసాయి సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం కళాకారులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్ రాజు దంపతులు జ్ఞాపికతో పాటు నూతన వస్త్రాలను బహూకరించారు.

క్లుప్తంగా

ఘనంగా సుదర్శన హోమం



నేమకల్లు ఆంజనేయస్వామిని వెన్నతో అలంకరించిన దృశ్యం

బొమ్మనహాళ్: శ్రావణ మాస ఉత్సవాలను పురస్కరించుకుని ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను వెన్నతో అలంకరించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. వెండి కవచధారణ, బంగారు కిరీటధారణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రశాంత్‌నీల్



పూజలు నిర్వహిస్తున్న ప్రశాంత్ నీల్

మడకశిర రూరల్: మండలంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయాన్ని కేజీఎఫ్ చిత్ర దర్శకుడు ప్రశాంత్‌నీల్ సందర్శించారు. తన స్వగ్రామమైన నీలకంఠాపురానికి బుధవారం చేరుకున్న ఆయన వేణుగోపాలస్వామి, నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో అర్చకులు ఆయనకు స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. తన చిన్నాన్న ఎస్.రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా రూపుదిద్దుకున్న నీలకంఠేశ్వరస్వామి సముదాయ ఆలయాలను పరిశీలించి, హర్షం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి నేరుగా తన తండ్రి సుభాష్ సమాధి వద్దకు చేరుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డిని ఆయన స్వగృహంలో కలసి కంటి ఆస్పత్రి నిర్మాణం, ఆలయాల అభివృద్ధిపై చర్చించారు.

నెరవేరిన దశాబ్దాల కల

- సంచార జాతులకు ధ్రువీకరణ పత్రాల మంజూరు
- జారీ చేసిన కలెక్టర్ అరుణ్‌బాబు
- చేరువ కానున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు



జనన ధ్రువీకరణ పత్రాలు అందుకున్న సంచార జాతుల వారితో అధికారులు

పుట్టపర్తి అర్బన్: దశాబ్దాలుగా తమకంటూ ప్రత్యేక గుర్తింపు లేక అన్ని విధాలుగా అణచివేతకు గురైన సంచార జాతుల జీవితాల్లో జగన్ సర్కార్ వెలుగులు నింపింది. కలెక్టర్ అరుణ్‌బాబు చొరవతో వారికి ధ్రువీకరణ పత్రాల జారీకి అనుమతులు జారీ చేసింది. దీంతో కొత్తచెరువు శివారున గుడారాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న 74 కుటుంబాలకు బుధవారం సచివాలయం ద్వారా ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందజేశారు.

దశాబ్దాలుగా పట్టించుకోని పాలకులు..

కర్ణాటక సరిహద్దుతో పాటు చిలమత్తూరు తదితర ప్రాంతాల నుంచి వలస వచ్చిన సంచార జాతుల వారు కొన్నేళ్లుగా కొత్తచెరువు గ్రామ శివారును గుడారాలు ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డారు. పల్లెలు తిరుగుతూ చిరు వ్యాపారాలతో పాటు భిక్షాటనతో జీవనం సాగిస్తున్నారు. వీరికి స్థిర నివాసం లేకపోవడంతో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు పొందలేకపోయారు. జనన ధ్రువీకరణ పత్రాలు లేక వీరి పిల్లలు చదువులకు దూరమయ్యారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకూ నోచుకోలేక పోయారు. తమ దుస్థితిని దశాబ్దాలుగా పాలకుల వద్ద మొరపెట్టుకున్నా.. ఏ ఒక్కరూ స్పందించలేదు.

స్పందించిన కలెక్టర్..

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తూ పేదల జీవన ప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే సరైన ధ్రువీకరణ పత్రాలు లేక ఇబ్బంది పడుతున్న వారిని, అర్హత ఉండీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరని వారిని గుర్తించేందుకు వీలుగా ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా వేలాది మందికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులు ఉచితంగా జారీ చేశారు. ఫలితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి వారికి అర్హత దక్కేలా చేశారు. ఈ విషయం గుర్తించిన సంచార జాతుల వారు తమ దుస్థితిని ఏకరవు పెడుతూ తమకూ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలంటూ ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబును కలసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో పాటు ఆధార్ నమోదుకు చర్యలు తీసుకోవాలని కొత్తచెరువు తహసీల్దార్ రామాంజులరెడ్డిని ఆదేశించారు. రెండు రోజుల వ్యవధిలోనే అధికారులు 74 కుటుంబాలకు జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌ను మరువలేం



నాకు 45 సంవత్సరాల వయసు. ఇంత వరకూ నాకు ఆధార్ కార్డు లేదు. ఎక్కడికి వెళ్లినా ఆధార్ తీసుకురా అంటూ చెప్పేవాళ్లే కానీ మా సమస్యను పరిష్కరించలేదు. బర్త్ సర్టిఫికెట్లు లేకపోవడంతో పిల్లలను బడికి పంపలేక పోతున్నాం. మా సమస్య విన్న కలెక్టర్ సార్ వెంటనే పరిష్కరించడం చాలా సంతోషంగా ఉంది. ఆ సార్‌ను మేము మరువలేం. – కిష్టప్ప, కొత్తచెరువు

పింఛన్ వస్తుందంట...



నాకు 60 ఏళ్లు దాటాయి. సర్టిఫికెట్లు ఇస్తే పింఛన్ ఇస్తామంటారు. వాటి కోసం ఎవరిని అడిగినా పట్టించుకోలేదు. ఏ పనికి పోయినా ఆధార్ కార్డు కావాలంటారు. ఇంత కాలం సర్టిఫికెట్లు లేక నానా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు సర్టిఫికెట్ ఇచ్చారు. పింఛన్ కూడా వస్తుందంటున్నారు. సీఎం జగన్ సార్, కలెక్టర్ సార్‌కు మేమెంతో రుణపడి ఉంటాం. – సుంకమ్మ, కొత్తచెరువు

పక్కా ఇల్లు వస్తుంది



నేను పుట్టినప్పటి నుంచి చూస్తున్నా... అంతా గుడారాల్లోనే బతుకుతున్నాం. ఇప్పటి వరకూ మా బతుకుల్లో మార్పు లేదు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత కలెక్టర్ సార్ చొరవతో మాకు సర్టిఫికెట్లు అందాయి. ఆధార్ కార్డు, పక్కా ఇల్లు కూడా వస్తుందంటున్నారు. ఇవన్నీ నెరవేరితే సీఎం జగనన్న, కలెక్టర్ సార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. – గంగ, కొత్తచెరువు

బిడ్డను బాగా చదివిస్తా



మాది కడప జిల్లా కమలాపురం. నేను, నా భర్త గత పదేళ్లుగా ఈ గుడారంలోనే బతుకుతున్నాం. ఇప్పటి వరకూ ఒక్క అధికారి కూడా ఇక్కడకు వచ్చింది లేదు. బుధవారం నా భర్తకు, నా బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. బిడ్డను బాగా చదివిస్తా. మరి కొన్ని రోజుల్లో ఆధార కార్డు ఇస్తామన్నారు. చాలా సంతోషంగా ఉంది. – కుమారి, కొత్తచెరువు

బుగ్గరామలింగేశ్వరున్ని తాకిన సూర్య కిరణాలు



తాడిపత్రి అర్బన్: స్థానిక ప్రాచీన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. శ్రావణ మాసంలో వచ్చే కృష్ణ పక్షం అష్టమి సందర్భంగా బుధవారం సాయంత్రం మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకాయి. విషయం తెలుసుకున్న భక్తులు సాయంత్రం 6 గంటలకు ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎన్‌సీసీ శిక్షణ భవితకు భరోసా

- తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ జనరల్ డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డి



క్యాడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న వీఎం రెడ్డి

కూడేరు: ఎన్‌సీసీలో శిక్షణ పొందితే ఉజ్వల భవిత ఉంటుందని తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ జనరల్ డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డి అన్నారు. కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.రమేష్, ప్రణాళిక–సహకార అసిస్టెంట్ డైరెక్టర్ కల్నల్ సంజయ్ గుప్తాతో కలసి బుధవారం ఆయన కూడేరు మండలంలోని ఎన్‌సీసీ నగర్‌ను సందర్శించారు. సీఏటీసీ–6వ ఆంధ్రా బెటాలియన్ శిక్షణా తరగతులు, మౌలిక వసతులు పరిశీలించారు. మ్యాప్‌రీడింగ్, ఆప్టికల్, ఫైరింగ్‌లో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను అభినందించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశమూ క్యాడెట్ల బంగారు భవిష్యత్‌కు దోహదపడుతుందన్నారు. ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్లతో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌సీసీ కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ నెలలో ఢిల్లీలో జరిగే తల్ సైనిక్ క్యాంప్‌లో పాల్గొనే క్యాడెట్లను ఇక్కడ శిక్షణ పొందుతున్న వారి నుంచే ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా, ఎన్‌సీసీ అధికారులు, శ్రీసత్యాసాయి, నంద్యాల, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన క్యాడెట్లు పాల్గొన్నారు.

10న నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: ఈ నెల 10న నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం అనంతపురంలోని జయమణెమ్మ కల్యాణమంటపంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ మహిళా ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఉమామహేశ్వరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 10న ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, సలహాదారు శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం నాగరాజు, ప్రధాన కార్యదర్శి శివశంకర్, కోశాధికారి నాగరాజు, దివాకర్, వివేకానంద స్వామి, నరసింహులు, రమేష్, వెంకటేష్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని ఇద్దరి మృతి



మృతులు సురేష్‌రెడ్డి, ఓబుళరెడ్డి

ఆత్మకూరు: వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మృతులిద్దరూ ఆత్మకూరు వాసులే కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరుకు చెందిన ఓబుళరెడ్డి (35), సురేష్‌రెడ్డి (47) బుధవారం పనిపై అనంతపురానికి వెళ్లారు. రాత్రికి పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి వద్దకు చేరుకోగానే కళ్యాణదుర్గం నుంచి అనంతపురానికి టమాట తరలిస్తున్న బొలెరో పికప్ వాహనం వేగంగా దూసుకొచ్చి ఢీకొంది. ఘటనలోద్విచక్రవాహనం నుజ్జునుజ్జైంది. తీవ్రంగా గాయపడిన ఓబుళరెడ్డి, సురేష్‌రెడ్డిని స్థానికులు వెంటనే హైవే అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతులిద్దరూ వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. ఓబుళరెడ్డి అవివాహితుడు. సురేష్‌రెడ్డికి భార్య ధనలక్ష్మి, ఓ కుమార్తె ఉన్నారు. విషయం తెలియగానే ఆత్మకూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలసిమెలసి ఉండేవారు రోడ్డు ప్రమాదంలో మరణించారన్న విషయం తెలయగానే రెండు కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఏం'జేసి'నా.. కష్టమే!

- ప్రశ్నార్థకంగా జేసీ సోదరుల రాజకీయ భవిష్యత్తు
- టీడీపీ సర్వేలోనూ వెనుకంజ?
- 'ప్రత్యామ్నాయం'పై అధిష్టానం దృష్టి
- అనుచరుల్లో నిరాశా నిస్పృహలు
- 'బ్రదర్స్' అహంకారంతో వారసులకూ నష్టం



తాడిపత్రి: ఒకప్పుడు ఇంట్లో కూర్చొనే కనుసైగలతో జిల్లా రాజకీయాలను శాసించిన జేసీ సోదరుల రాజకీయ భవిష్యత్తు నేడు ప్రశ్నార్థకంగా మారింది. అహంకారం, నోటి దురుసు వారిని ఈ స్థాయికి తెచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వారి తీరుతో వారసుల రాజకీయ భవిష్యత్తూ ప్రమాదంలో పడింది. జేసీ సోదరులు సుమారు 35 ఏళ్ల పాటు తాడిపత్రి నియోజకవర్గాన్ని కబంధ హస్తాల్లో ఉంచుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వారి వైఖరితో విసిగి వేజారిన ప్రజలు 2019 ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పారు. వైఎస్సార్‌సీపీని ఆదరించి కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయి. ఫలితంగా వైఎస్సార్‌సీపీకి మరింత ఆదరణ పెరిగింది. ఇటీవల కేతిరెడ్డి పెద్దారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్రకు విశేష జనాదరణ లభించడమే ఇందుకు నిదర్శనం. ఈ పరిణామాలు జేసీ బ్రదర్స్‌ను, వారి అనుచరులను అంతర్మథనంలో, ఆందోళనలో పడేశాయి.

సర్వేలోనూ వెనుకంజ?

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో రాష్ట్రంలోని టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లపై ఆ పార్టీ అధిష్టానం ఇటీవల సర్వే చేయించినట్లు తెలుస్తోంది. అందులోనూ జేసీ సోదరులు వెనుకంజలో ఉన్నట్లు సమాచారం. మునిసిపల్ చైర్మన్‌గా పట్టం కట్టినా జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, అధికారులను టార్గెట్ చేస్తూ, నోటిదురుసుగా మాట్లాడుతూ పాలన కుంటుపడేలా చేశారన్న అంశం సర్వేలో వెల్లడైనట్లు తెలిసింది. జేసీ ప్రభాకర్‌రెడ్డి వల్ల టీడీపీకి నష్టమే కానీ, చేకూరే లాభం ఏమీలేదన్న విషయం వెల్లడి కావడంతో ఆ పార్టీ అధిష్టానం ప్రత్యామ్నాయ నాయకత్వంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా గతంలో జేసీ సోదరులపై వరుసగా పోటీ చేసి ఓటమి పాలైన నాయకుడి వైపు చూస్తున్నట్లు సమాచారం. అతనికి టికెట్ కేటాయిస్తే కనీసం డిపాజిట్ అయినా దక్కుతుందని, లేదంటే అదీ గల్లంతేనన్న భావన టీడీపీ వర్గాల్లోనే వ్యక్తమవుతోంది.

దూరమవుతున్న కేడర్

జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యవహారశైలిపై సొంత పార్టీ కేడర్‌లోనే అసంతృప్తి ఉంది. తన ఉనికి కోసం మాత్రమే పాకులాడే ఆయన్ను నమ్ముకుంటే తమకు నష్టమేనని కొందరు కౌన్సిలర్లు భావిస్తున్నారు. టీడీపీ సొంత సామాజిక వర్గం కూడా జేసీ వ్యవహారశైలిని తప్పుబడుతోంది. చివరకు అనుచరుల్లోనూ తీవ్ర నిరాశా నిస్పృహలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే జేసీ అనుచరుడు, పెద్దపప్పూరు మండల నాయకుడు రఘునాథ్‌రెడ్డి ఇటీవల వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. అలాగే కౌన్సిలర్ రాబర్ట్, అయూబ్ బాషా పార్టీకి రాజీనామా చేశారు. మరికొందరు ఇదేబాటలో పయనించేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఉలిక్కిపడిన జేసీ సోదరులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తమ నివాసంలో విందు ఏర్పాటు చేసి బుజ్జగించినట్లు తెలిసింది. అయినప్పటికీ కేడర్ వారిని విశ్వసించడం లేదు.

వారసులకు నష్టం

జేసీ కుటుంబాన్ని నియోజకవర్గ ప్రజలు సుదీర్ఘ కాలం పాటు ఆదరించినప్పటికీ వారి ఇబ్బందులను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. సరికదా ఏవైనా సమస్యలు చెప్పుకునేందుకు తమ వద్దకు వచ్చిన ప్రజలను నోటికి ఎంతొస్తే అంత మాట అనేవారు. చులకనగా, హేళనగా మాట్లాడేవారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే నియోజకవర్గంలో పర్యటించి హడావుడి చేసేవారు. ఎన్నికల అనంతరం వ్యాపారాలకు పరిమితమయ్యేవారు. జేసీ బ్రదర్స్ అహంకారపూరితంగా, పెత్తందారీ తనంతో వ్యవహరిస్తూ ప్రజలను నిర్లక్ష్యం చేసిన ఫలితంగా 2019 ఎన్నికల్లో వారి వారసులుగా బరిలోకి దిగిన జేసీ పవన్, జేసీ అస్మిత్‌రెడ్డిలను ఓడించి గట్టిగానే గుణపాఠం నేర్పారు. ఇప్పుడు కూడా వారసుల రాజకీయ ఎదుగుదలకు జేసీ సోదరులే ప్రతిబంధకంగా మారారన్న భావన తాడిపత్రి ప్రజల్లో వ్యక్తమవుతోంది.

లారీ దగ్ధం



లారీలో ఎగిసి పడుతున్న మంటలు

హిందూపురం అర్బన్: మొబైల్ బ్యాటరీలు తరలిస్తున్న ఓ లారీ అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ తెలిపిన మేరకు... రాజస్తాన్ ప్రాంతంలో సేకరించిన మొబైల్ బ్యాటరీలు (వాడి వృథాగా పడేసినవి) హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి కొనుగోలు చేసి, హిందూపురం పారిశ్రామిక వాడలోని సంగీత్ కర్మాగారానికి ఓ లారీలో తరలించాడు. బుధవారం మధ్యాహ్నం కొల్లకుంట ఫ్లై ఓవర్ వద్దకు చేరుకోగానే లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వాహనం నుంచి కిందకు దూకేశాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఘటనలో రూ.10 లక్షల మేర నష్టం చేకూరినట్లు అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఎండ ప్రభావానికి తోడు బ్యాటరీల్లో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు చెలరేగినట్లుగా తెలుస్తోంది.

యువకుడి ఆత్మహత్య



వంశీకృష్ణ (ఫైల్)

తాడిపత్రి: నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని టైలర్స్ కాలనీకి చెందిన ధనలక్ష్మి, రమేష్‌బాబు దంపతుల కుమారుడు వంశీకృష్ణ (23) బీటెక్ పూర్తి చేశారు. కొంత కాలంగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనకు కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో చికిత్స చేయిస్తున్నారు. ఇటీవల కాస్త మతిస్థిమితం లేక మాట్లాడుతూ తీవ్ర మానసిక సంఘర్షణలో సతమతమయ్యేవాడు. ఈ క్రమంలోనే మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చిన వంశీకృష్ణ... పుట్లూరు రోడ్డులోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఆటో నుంచి జారి పడి వృద్ధురాలి మృతి

కదిరి అర్బన్: ఆటో నుంచి జారిపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరి కుంట్లపల్లి రాజారెడ్డి కాలనీకి చెందిన శివమ్మ (67) బుధవారం ఉదయం పందులకుంటలో కూలి పనులు ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమైంది. ఆటోలో తనకు చోటు లేకపోవడంతో డ్రైవర్ పక్కనే కూర్చొని ప్రయాణిస్తున్న ఆమె సోమేషనగర్ వద్దకు చేరుకోగానే కుదుపులకు అదుపు తప్పి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు కదిరిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై కదిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పైడేటి బాలుడి కిడ్నాప్‌కు విఫలయత్నం

పరిగి: మండలంలోని పైడేటిలో అక్షయ్ అనే పదేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయడానికి దుండగులు విఫల యత్నం చేసిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. తల్లిదండ్రులు రూప, వెంకటేష్ తెలిపిన మేరకు... బుధవారం రాత్రి 7 గంటలకు తమ ఇంటికి సమీపంలోనే బహిర్భూమికి అక్షయ్ వెళ్లాడు. ఆ సమయంలో కొందరు దుండగులు బాలుడిని గోనె సంచిలో బంధించేందుకు ప్రయత్నిస్తుండగా గట్టిగా కేకలు వేస్తూ వారి చెర నుంచి తప్పించుకుని ఇంటి వైపుగా పరుగు తీశాడు. కుమారుడి కేకలతో అప్రమత్తమైన తల్లిదండ్రులు ఇంట్లో నుంచి బయటకు వచ్చి చూసే లోపు దుండగులు అక్షయ్ వైపు కత్తి విసిరి ఉడాయించారు. కత్తి దాడి నుంచి త్రుటిలో బాలుడు తప్పించుకున్నాడు. ఘటనపై పోలీసులకు బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

జాతీయ స్థాయి లేఖ రచనా పోటీలు

అనంతపురం సిటీ: తపాలా శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి లేఖ రచనా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ అనంతపురం పీఆర్‌ఓ ప్రమోద్ బుధవారం తెలిపారు. భారత తపాలా శాఖ చేపట్టిన 'ఢాయి ఆఖర్' కార్యక్రమంలో భాగంగా 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అనే అంశంపై లేఖ రచనా పోటీలు ఉంటాయి. ఇన్‌ల్యాండ్ లెటర్/పోస్టుకార్డు/ఏ4 పేజీల్లో వ్యాసం రాయాల్సి ఉంటుంది. అన్ని వయస్సుల వారిని నాలుగు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించనున్నారు. పరీక్షలో పాల్గొనేందుకు ముందుకు వచ్చే విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పోస్టాఫీసులు పరిధిలోని సిబ్బంది ద్వారా పోటీలు ఏర్పాటు చేస్తారు. అక్టోబర్ 31లోగా తెలుగు, ఆంగ్లం, హిందీ బాషల్లో పోటీలు ఉంటాయి. రాసిన వ్యాసాలను విజయవాడ సర్కిల్ కార్యాలయానికి పంపితే, అక్కడి నుంచి న్యూఢిల్లీకి పంపుతారు. పోటీల్లో గెలుపొందిన వారికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.25 వేలు, ద్వితీయ బహుమతి కింద జాతీయ స్థాయిలో రూ.25 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.10 వేలు, తృతీయ బహుమతి కింద జాతీయ స్థాయిలో రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.5 వేలు నగదు పురస్కారాలు ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న వారు పోటీల్లో పాల్గొనవచ్చు.